కూరగాయల రైతు కుదేలు



కుళ్లిపోతున్న మొక్కలను దిగాలుగా చూపుతున్న రైతు

- గత నెల కురిసిన వర్షాలతో అపార నష్టం
- ఊటబారి దెబ్బతిన్న ఆకుకూరలు, మొక్కలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



మొక్కలు చనిపోవడంతో ఖాళీగా ఉన్న మడులు

గార: గత నెలలో కురిసిన ఎడతెరిపి లేని వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. ప్రధానంగా కూరగాయలు, ఆకుకూరలు పండిచే రైతులు కుదేలయ్యారు. కుటుంబ సభ్యులంతా ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు తమ కళ్లెదుటే పాడైపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా డిసెంబర్ చివరిలో వారం రోజుల పాటు కురిసిన వర్షాలు కారణంగా పంట భూముల్లో నీరు చేరి ఊట పట్టడంతో కూరగాయ పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అపార నష్టం వాటిల్లింది. గార మండలం శ్రీకూర్మంలో పొందర వీధిలో 95 మంది, తూలుగులో కూరాకుల కులస్తులు 20 మంది నిత్యం కూరగాయలు, ఆకుకూరలు పండిస్తుంటారు. హోల్‌సేల్‌తో పాటు ఇంటింటికీ వెళ్లి అమ్మకాలు సాగిస్తుంటారు. అంపోలు, నిజామాబాద్, చల్లపేట తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. వీరు కూడా శ్రీకాకుళం నగరానికి కూడా వెళ్లి అమ్మకాలు సాగిస్తుంటారు. గత నెలలో కురిసిన వర్షాలతో వంగ, టమాట, తోటకూర, పాలకూర, చుక్క కూర, మెంతు కూర, కొత్తిమీర, సొత్తుకూర మడుల్లో నీరు చేరి భూమి ఊట పట్టడంతో మొక్కలన్నీ చనిపోయాయి. ఉల్లి కాడలు విరిచిన తర్వాత కాడల ద్వారా నీరు లోపలికి దిగి ఉల్లిపాయలు కుళ్లిపోయే పరిస్థితి వచ్చింది. తీగ జాతి పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకి పూత, పిందె కింద రాలిపోతున్నాయి. దీంతో రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు నష్టం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించిన పంట అధిక వర్షాలు, వాయుగుండం కారణంగా నష్టాల బారిన పడ్డామని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నారు.

రూ.15 వేలు నష్టం..



నేను ఆకు కూరలు, కాయగూరల పంటలు పండిస్తున్నాను. రోజుల తరబడి వర్షాలు కురవడంతో మడుల్లో నీరు చేరి పంటంతా కుళ్లిపోతోంది. మొత్తం పడేయాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. ఆకుకూరల మొక్కలు పాడైపోవడంతో రూ.15 వేలు వరకు నష్టం వచ్చింది.

– దామోదర రాములమ్మ, పొందర వీధి, శ్రీకూర్మం

ప్రభుత్వం ఆదుకోవాలి



పెట్టుబడి పెట్టిన పంట లన్నీ కళ్లెదుటే కుళ్లిపోతున్నాయి. ఎన్నడూ లేని విధంగా డిసెంబర్‌లో వర్షాలు రావడంతో చాలా నష్టపోయాం. అప్పులు చేసుకొని 30 సెంట్లలో కూరగాయలు సాగు చేశాను. ఇందులో 10 సెంట్లు పంట కూడా వచ్చే పరిస్థితితి కనిపించడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– దామోదర సత్యం, కూరగాయల రైతు, పొందరవీధి, శ్రీకూర్మం

క్లుప్తంగా

రామకృష్ణ మిషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రామకృష్ణ మిషన్ క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం వైపే దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ఆర్.జనార్దన్

గార: చెడు మార్గాలను వదిలి లక్ష్యం వైపే దృష్టి సారించాలని ఎస్ఐ ఆర్.జనార్దన్ అన్నారు. శుక్రవారం గార జెడ్పీ హైస్కూల్‌లో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాట్లాడారు. బాధ్యతగా మెలగాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవమివ్వాలని సూచించారు. మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కావద్దన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, వ్యాయామం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరుణకుమారికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న కూర్మాన అరుణకుమారి

జి.సిగడాం: మండలంలోని అద్వాన్నంపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డాక్టర్ కూర్మాన అరుణకుమారి శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మేరా భారతీయ చైతన్య సంఘం ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అరుణకుమారిని ఎంఈఓలు అరసాడ రవి, ముఖ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జెమ్స్‌లో 'అన్నెపురెడ్డి' వర్ధంతి



అన్నెపురెడ్డి సత్యనారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో అన్నెపురెడ్డి సత్యనారాయణ రెడ్డి వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏఎస్ఆర్ సిరీస్ పేరిట ఇనాగరల్ లెక్చర్స్ ప్రవేశపెట్టారు. ఎనాటమి, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీలో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కో విభాగానికి చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ బొల్లినేని అదిత్య, ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత, సూపరింటెండెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అన్నవితరణ



అన్నవితరణ చేస్తున్న సమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక విశాఖ–బీ కాలనీలోని షిర్డీసాయి మందిరం నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 250మందికి అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో కె.శివశంకర్, బొచ్చ జగదీష్, ఉర్లం శివతేజ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

ఎచ్చెర్ల: లావేరు మండలం నాగంపాలెంలో శుక్రవారం తహశీల్దార్ వై.జోగారావు ఆధ్వర్యంలో భూ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ తిరుపతిరావు, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్రార్చనలు



శ్రీకాకుళం నగరంలోని కోటి వీధిలో శ్రీరాజరాజేశ్వరి పీఠంలో పుష్యమాస శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శ్రీచక్రార్చనలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు సుసరాపు దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నవ ఆవరణ అర్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. –శ్రీకాకుళం కల్చరల్

దేవీ వైభవం



లావేరు మండల కేంద్రంలోని కనక దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నేతేటి రుషి కుమార్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాల అనంతరం వివిధ రకాల పుష్పలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. – ఎచ్చెర్ల

గోతులతో తప్పని పాట్లు



పాలఖండ్యాం–ఆనందపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్ల వద్ద భారీ గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. – జి.సిగడాం

వైభవంగా 'కుత్తు విలక్కు' దీపోత్సవం



స్వామివారికి ఊయల ఉత్సవం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కుత్తు విలక్కు దీపోత్సవం, ఊంజల సేవ ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ఊయలపై ఉంచి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం శివశ్రీ నృత్య కళానికేతన్‌కు చెందిన స్ఫూర్తి మాధుర్య శిష్య బృందం నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. డి.రామారావు, శిష్య బృందం సంగీత కచేరీ నిర్వహించారు.

ఆర్థిక భారత నిర్మాత మన్మోహన్‌సింగ్



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

శ్రీకాకుళం అర్బన్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని, ఆర్థికంగా భారతదేశం ఈ రోజు మంచి స్థితిలో ఉందంటే అది ఆయన చూపిన మార్గమేనని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నేతలంతా ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, రాష్ట్ర ఎస్సీ విభాగ ప్రధాన కార్యదర్శి తెంబూరు మధుసూదనరావు, బొచ్చ వెంకటరమణ, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకటనాయుడు, కూరాకుల వెంకటరావు, అంబటి దాలినాయుడు, ఇజ్జరోతు రమణ, గొల్లపల్లి దాలయ్య, గుంటబారిక అప్పారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



జి.సిగడాం: స్వాతినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని దవళపేటకు చెందిన పేడాడ స్వాతినాయుడు తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, సర్పంచ్ వడశ మహేశ్వరరావు, ఉప సర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు, డోల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: లావేరు మండలం సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నడుపూరి రాంబాబు కుమారుడు హరిబాబు కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో గాయపడి విశాఖలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు.

సామాన్య భక్తులకే పెద్దపీట



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి మహోత్సవాల నిర్వహణలో సాధారణ భక్తుల సౌకర్యాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు ఎస్పీ కెవి.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి అరసవల్లిలో ఏర్పాట్ల తీరుపై చర్చించారు. అనంతరం సింహద్వారం, ఆలయ పరిసరాలను సందర్శించారు. అధికారులు సిద్ధం చేసిన రూటు మ్యాపును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉచిత దర్శనాలకు వచ్చిన భక్తులకు వేగంగా సౌకర్యవంతంగా దర్శనమయ్యేలా స్థానిక ప్రముఖులు, భక్తుల సలహాలను పరిగణనలోనికి తీసుకోనున్నామని తెలిపారు. ఈ ఏడాది రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించటంతో గట్టి బందోబస్తు చర్యలు చేపడతామని వివరించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ జిల్లా సాహిత్య సాంస్కృతిక వైభవాలను చాటిచెప్పేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆలయ ఈఓ వై.భద్రాజీ మాట్లాడుతూ భక్తుల సూచనలతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుది రూట్‌మ్యాపును సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో వేడుకల నిర్వహణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అందరి భాగస్వామ్యంతో రథసప్తమి పండుగను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రథసప్తమి వేడుకల నిర్వహణపై వివిధ స్వచ్ఛంద సంస్థలు, భక్తుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నగర ప్రజలంతా లైటింగ్, డెకరేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులుతో రథసప్తమి వేడుకలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఈఓ భద్రాజీ, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొన్నావీధిలో మేలుకొలుపులు



శ్రీకాకుళం కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా కొన్నావీధి భీమేశ్వరాలయ భజన బృందం ఆధ్వర్యంలో శుక్రవారం మేలుకొలుపు నిర్వహించారు. ఇందిరానగర్ కాలనీ, రైతుబజారు, కొన్నావీధి, రాధాకృష్ణానగర్, చాపురం తదితర ప్రాంతాల్లో హరేరామ భజన గీతాలను ఆలపించారు.

యంత్ర సేద్యమే మేలు



పంటను పరిశీలిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

జి.సిగడాం: యంత్రాల సాయంతో ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. శుక్రవారం మెట్టవలసలో దుక్కి దున్నకుండా వేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోత పూర్తయిన వెంటనే యంత్రం ద్వారా దుక్కి దున్నకుండా మొక్కజొన్న విత్తుకుంటే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి డి.సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శప్రాయం

బాలికల విద్యతోపాటు మహిళల హక్కుల కోసం తపించిన మొదటి మహిళా ఉపాధ్యాయినిగా దేశవ్యాప్తంగా కీర్తిగడించిన సావిత్రిబాయి పూలే జీవితం ప్రతి మహిళకు ఆదర్శవంతమని వక్తలు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా విద్యాసంస్థల్లో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం న్యూకాలనీ: అంబేద్కర్ విజ్ఞాన్ మందిరంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు సత్కారం



శ్రీకాకుళం కల్చరల్: పూలే పార్కులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నివాళి



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న విగ్రహ కమిటీ సభ్యులు



శ్రీకాకుళం న్యూకాలనీ చేపలవీధి మున్సిపల్ హైస్కూల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కారం



ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక కేజీబీవీలో పూలేకు నివాళులు



ఎచ్చెర్ల క్యాంపస్: అంబేద్కర్ వర్సిటీ సావిత్రిబాయి పూలేకు నివాళులు



గార: అంపోలు జెడ్పీ హైస్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



శ్రీకాకుళం కల్చరల్: సాహితీ చైతన్య కిరణాలు ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు



శ్రీకాకుళం: సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న ఏఎంఓ సుధాకర్

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పూలే పురస్కారం

ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.అరుణకుమారికి భారత చైతన్య యువజన పార్టీ సావిత్రిబాయి పూలే పురస్కారంతో సత్కరించింది. శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో బి.సి.వై.పి. జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, నటుడు బ్రహ్మానందం చేతుల మీదుగా ఈ పురస్కారం స్వీకరించారు.

జలధౌతితో ఆరోగ్యం



ఎచ్చెర్ల క్యాంపస్ : జలధౌతితో ఆరోగ్యం సాధ్యమవుతుందని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం ప్రాంగణంలో జాతీయ సేవాపథకం యూనిట్-4, యోగా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జలధౌతి కార్యక్రమం నిర్వహించారు. కరక్కాయ పొడి, వేప, తులసి ఆకులతో తయారుచేసిన ద్రావణాన్ని విద్యార్థులతో తాగించారు. దీని వల్ల ఆస్తమా, అల్సర్, జలుబు, దగ్గు, అంటు వ్యాధులు, మహిళా సంబంధిత వ్యాధులు తగ్గుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కె.మోహన్‌కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవికి కుంకుమార్చనలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలో జెడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలో లలితాదేవికి శుక్రవారం కుంకుమ పూజలు నిర్వోహించారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామ స్తోత్రపారాయణలు చేశారు.

ఘనంగా విజయగణపతి హోమం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డు విజయగణపతి ఆలయంలో శుక్రవారం పుష్యమాస శుద్ధ చవితి సందర్భంగా అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో మూలమంత్ర సహిత హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.